

విశ్వావసు.. శుభైశ్వర్యాల సిద్ధిరస్తు

ముందస్తు ఉగాది వేడుకల్లో భాగంగా పచ్చడి తయారు చేసిన మహిళలు



జీవితం అనేక అనుభవాల అనుభూతుల ఆనందాల మిశ్రమం. వీటన్నింటికీ ప్రతీకగా జీవితాన్ని షడ్రుచుల సమ్మేళనంగా వర్ణిస్తారు. సుఖసంతోషాల తీయదనం, దుఃఖాల చేదుతనం... విసుగుదనాల పులుపుదనం..కొత్త సవాళ్ల వగరుదనం.. నూతనోత్సాహాల ఉప్పందనం, కఠిన పరిస్థితుల నెదుర్కొనే ఘాటుదనం ఇలా.. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడే జీవితం. జీవితంలో అన్నింటినీ సమానంగా స్వీకరించాలనే ఈ ఉగాది పచ్చడి అంతరార్థం. విశ్వావసు అంటే పవిత్రత, శుభాలను కలగజేయడంతో పాటు ఐశ్వర్యాన్ని కూడా తీసుకొచ్చేదని అర్థం. ఈ విశ్వవసు నామ ఉగాదికి సంబంధించిన సాక్షి ప్రత్యేక కథనాలు 8వ పేజీలో..

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



మార్కెట్‌లో కుండలు కొనుగోలు చేస్తున్న పట్టణవాసులు

న్యూస్‌రీల్

'గౌరీభట్ల'కు పురస్కారం



గజ్వేల్: రాష్ట్ర ప్రభుత్వం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది–2025 అవార్డుకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన గౌరీభట్ల చక్రధారి శర్మ ఎంపికయ్యారు. ఈయన సికింద్రాబాద్‌లోని గణేశ్ ఆలయంలో గణపతి ఉపనిషత్ పారాయణదారుగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రూ.10,116 నగదు ప్రోత్సాహకంతోపాటు పురస్కారాన్ని అందుకోనున్నారు.

సంపద వనం సందర్శన



వనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ జయదేవ్ ఆచార్య

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం గ్రామ పంచాయతీ పరిధిలో గల సంపద వనాన్ని శనివారం డీఆర్‌డీఓ జయదేవ్ ఆచార్య సందర్శించారు. ఇటీవల విజిలెన్స్ టీం వనంను సందర్శించగా మొక్కల పెంపకం సరిగా లేకపోవడంతో పాటు తక్కువగా ఉన్నాయని గుర్తించారు. ఈ క్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్ ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి తెప్పించిన మొక్కలను నాటిన విధానంతో పాటు పోషణ బాధ్యత తీరులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ నర్సింగరావు, సీటీఏ మహేందర్, పంచాయతీ కార్యదర్శి మమత, ఏపీఓ, టీఏ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురువన్నపేట పాఠశాలకు బస్సు

హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



పాఠశాలకు అప్పగించిన బస్సు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట పాఠశాలలో ఈనెల 15న ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోసాన్‌పల్లి, కొండపోచమ్మ గ్రామాలకు పాఠశాల దూరంగా ఉండటంతో సుమారు 200 మంది విద్యార్థులు ప్రైవేటు వాహనంలో పాఠశాలకు వస్తున్నారని, బస్సు ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు. ఇందుకు కలెక్టర్ బస్సును కొనుగోలు చేశారు. శనివారం సిద్దిపేట ఆర్టీఐ అధికారులు ప్రధానోపాధ్యాయుడు రాజుకు బస్సును అప్పగించారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు స్టీల్ గ్లాస్‌ల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉన్న స్టీల్ గ్లాస్‌లు

సాక్షి, సిద్దిపేట: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో టీ స్టాల్ నిర్వాహకులకు ఉచితంగా స్టీల్ టీ గ్లాస్‌లను పంపిణీ చేయాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్ణయించారు. తన తండ్రి సత్తయ్య గౌడ్ ట్రస్ట్ పేరిట నేడు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో పంపిణీ చేయనున్నారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లోని 135 టీ స్టాల్స్‌కు 13,500 స్టీల్ టీ గ్లాస్‌లను పంపిణీ చేయనున్నారు. ఒక్కో టీ స్టాల్‌కు దాదాపు 100 వరకు అందించనున్నారు.

నమో నారసింహ

- వైభవంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి విమాన రథోత్సవం
- భక్తజనులతో కిక్కిరిసిన నాచగిరి

వర్గల్(గజ్వేల్): భక్తులతో నాచగిరి కిక్కిరిసింది. హరినామ స్మరణతో హరిద్రాతీరం మార్మోగింది. మంగళ వాయిద్యాలు, బాజాభజంత్రీలు, కోలాటాలు, పోతరాజుల విన్యాసాలు, హనుమాన్ మాలధారుల భజనలు, భక్తుల కరతాళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా దివ్య విమానరథంపై శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ విశ్వనాథశర్మ పర్యవేక్షణలో శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు శ్రీలక్ష్మీనృసింహుని దివ్యవిమాన రథోత్సవ ఊరేగింపు ప్రారంభమైంది. తూర్పు, దక్షిణ, పడమర ద్వారాల మీదుగా మూడు గంటలపాటు కొనసాగి ఉత్తర ద్వారం వద్దకు చేరింది. రథోత్సవం అనంతరం అర్చకులు హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం శతఘటాభిషేకం నిర్వహించనున్నారు. హైదరాబాద్, ఉమ్మడి మెదక్, రంగారెడ్డి తదితర జిల్లాలు, పొరుగు రాష్ట్రం కర్నాటక నుంచి నాచగిరి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. హరిద్రానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డితో పాటు పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.



దివ్య విమాన రథంపై శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు

త్వరలో నాలుగులైన్ల పనులు

చేతకాకనే ఇంజినీరింగ్ కాలేజీ తెచ్చుకోలేదు : మంత్రి పొన్నం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్/ హుస్నాబాద్‌రూరల్: కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు నాలుగు లైన్ల రోడ్డుకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉగాది రోజున రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లెల్లగడ్డలో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, లైబ్రరీకి స్థలం కేటాయించామన్నారు. మహాసముద్రం గండి వద్ద స్థలం సేకరించామని తెలిపారు.

పదేళ్లు మంత్రిగా ఉండి ఏం చేశారు?

హుస్నాబాద్‌కు ఇంజినీరింగ్ కాలేజీని తెచ్చుకుంటే కొందరు విమర్శిస్తున్నారని, పదేళ్లు మంత్రిగా ఉన్న గంగుల కమలాకర్ చేతకాకనే కరీంనగర్‌కు కళాశాలను తెచ్చుకోలేదని ధ్వజమెత్తారు. కరీంనగర్‌కు లా కాలేజీ, హుస్నా బాద్‌కు ఇంజినీరింగ్ కళాశాల మంజూరైందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్లు తిరుపతి రెడ్డి, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు. ముస్లిం మహిళలకు మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంత్రి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

రైతులకు షాక్..



వానాకాలం సీజన్‌కు సంబంధించి బీటీ పత్తి విత్తనాల ధరలు పెరిగాయి. 475 గ్రాముల పరిమాణం (450 బీటీ, 25గ్రాముల నాన్ బీటీ) కలిగిన బీటీ–2 ప్యాకెట్ గతేడాది రూ.864 ఉండగా ఈ సారి రూ.901కు పెంచారు. దీని ప్రకారం ఒక్కో ప్యాకెట్‌పై రూ.37 అదనపు భారం పడనున్నది. జిల్లా రైతాంగానికి సీజన్‌లో 4.5లక్షల వరకు విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయి. పెరిగిన ధర ప్రకారం రైతులపై 1.66 కోట్ల మేర భారం పడనుంది.

బీటీ పత్తి విత్తన ధరలు పెంపు

- గతేడాది బీటీ–2 ప్యాకెట్‌కు రూ.864
- ప్రస్తుత ధర రూ.901
- ఒక్కో ప్యాకెట్‌పై రూ.37 పెరుగుదల
- జిల్లా రైతులపై రూ.1.66 కోట్ల భారం

గజ్వేల్: ఊహించినట్లుగానే ఈ సారి కూడా రైతులపై బీటీ పత్తి విత్తనాల భారం పడింది. జిల్లాలో వరి తర్వాత పత్తి కీలకం. విత్తనం నుంచి మొదలుకొని పంట చేతికందే వరకు పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరుగుతుండటంతో రైతులు కుంగిపోతున్నారు. జిల్లాలో ఏటా వానాకాలంలో వివిధ రకాల పంటలు 5.50లక్షల ఎకరాల్లో సాగవుతుండగా, ఇందులో పత్తి 1.5లక్షల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. రైతులు బీటీ–2 విత్తన ప్యాకెట్లు(475 గ్రాములు) సీజన్‌లో 4.5లక్షల ప్యాకెట్ల వరకు అవసరమవుతాయి. ఒక్కో ఎకరాకు రెండున్నర నుంచి మూడు ప్యాకెట్లను విత్తడానికి వాడుతారు. ఈ ప్యాకెట్‌లో 450 గ్రాముల బీటీ, మరో 25 గ్రాముల నాన్ బీటీ విత్తనాలు ఉంటాయి. గతేడాది రూ.864కు లభించింది. ఈ సారి విత్తన కంపెనీలు ఒక్కో ప్యాకెట్‌పై రూ.37 పెంచగా ప్రస్తుత ధర రూ.901కు చేరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. దీని ప్రకారం జిల్లా రైతాంగంపై రూ.1.66కోట్ల భారం పడనున్నది.

40కి పైగా కంపెనీలు ఇదే ధరపై విక్రయం

కాగా సుమారు 40వరకు కంపెనీలు తమ బీటీ–2 ఉత్పత్తులను పెరిగిన ధరలకు విక్రయించనున్నాయి. ఇక బీజీ–1 రకానికి చెందిన విత్తన ప్యాకెట్ల ధర గతేడాది రూ.635ఉంది. ఈ సీజన్‌లోనూ అదే ధరను కొనసాగించడానికి నిర్ణయించారు. కానీ ఈ విత్తనాలను రైతులు వినియోగించరు. సీజన్ మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్న దృష్ట్యా నిల్వలు తెప్పించడానికి వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. విత్తనాలపై సబ్సిడీ ఎత్తివేయడం, ఏటా ధరలు పెరుగుతుండటంతో రైతులపై ఆర్థిక భారం పడుతున్నది. ఈ సారైనా సబ్సిడీని పునరుద్ధరిస్తే తమకు మేలు జరుగుతుందనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

రైతుల అవసరం మేరకు విత్తనాలు



రాబోయే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుల అవసరం మేరకు బీటీ–2 విత్తనాలను అందుబాటులో ఉంచుతాం. ఇవే కాకుండా ఇతర పంటల విత్తనాలు సైతం సమృద్ధిగా నిల్వ ఉండేలా చూస్తాం.

– జిల్లా వ్యవసాయాధికారి రాధిక

న్యూమోనియాతో పాప మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆందోళన

గజ్వేల్‌రూరల్: వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కూతురు మృతి చెందిందని బాధిత కుటుంబీకులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన శనివారం రాత్రి గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రాయపోల్‌కు చెందిన శ్రీకాంత్ ఉమారాణి దంపతుల మూడు నెలల కూతురు సాన్విక ఈ నెల 24న తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో అదే రోజు సాన్వికను గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు మార్గంలో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు న్యూమోనియా ఉన్నట్లు గుర్తించి వైద్యం చేశారు.ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం పాప కోలుకున్నట్లు వైద్యులు చెప్పి డిశ్చార్జి చేశారు. తల్లిదండ్రులు ఇంటికి వెళ్లిన తర్వాత పాప చనిపోయినట్లు గుర్తించారు. దీంతో ఆసుపత్రికి వచ్చి పాప మృతదేహంతో ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ పాప మృతి చెందిందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ సీఐ సైదా ఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

- సొంత స్థలం ఉన్నవారికే ప్రాధాన్యం
- గృహ నిర్మాణ శాఖ పీడీ దామోదర్ రావు



ఇళ్లను పరిశీలిస్తున్న పీడీ దామోదర్ రావు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ప్రతి దశలో తోడ్పాటు అందించాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ(హౌసింగ్) పీడీ దామోదర్ రావు అన్నారు. శనివారం మండలంలోని కుందనవానిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 551 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో బెస్మెంట్ దశలో ఉన్న ఇళ్లకు రూ.లక్ష లబ్ధిదారుల అకౌంట్‌లో జమ అవుతాయన్నారు. అర్హులకే ఇళ్ల మంజూరు చేయాలని, అనర్హులకు ఇస్తే అధికారులపై చర్యలు తప్పవన్నారు. సొంత స్థలం ఉన్నవారికి మొదటి విడతలో ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, మాజీ సర్పంచ్ దినేశ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుచరిత, నాయకులు సారయ్య, స్వామిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

నీళ్లు మళ్లిస్తే కేసులు పెడతారా?

ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి



వినతిపత్రం చూపుతున్న అంజిరెడ్డి

ములుగు(గజ్వేల్): పంట పొలాలు ఎండుతున్నాయని ఆవేదనతో సాగునీరు కోసం కొండపోచమ్మ సాగర్ కాలువకు గండి చేసి నీళ్లు మళ్లిస్తే ములుగు మండలం నర్సంపల్లి గ్రామ రైతులపై పోలీసు కేసులు నమోదు చేస్తారా? అని ములుగు మండల పీఏసీఎస్ చైర్మన్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ప్రశ్నించారు. శనివారం ములుగులో ఆయన ఆ గ్రామస్తులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల పట్ల అనుసరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పంటలు ఎండుతున్న తరుణంలో ప్రభుత్వం రైతులపట్ల ఉదారత చూపాలే తప్పా కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. పంటలు ఎండిపోతున్నాయని కొండపోచమ్మ కాలువ ద్వారా నీరివ్వాలని ఏడాది కాలంగా రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేసినప్పటికీ ఫలితం లేదన్నారు. దీంతో పంటలను దక్కించుకోవడానికి నీళ్లను మళ్లించుకున్నందుకు రైతులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాలువల ద్వారా పంటలకు సాగునీరందించాలన్నారు. 9 మంది రైతులపై తప్పుడు కేసులు నమోదు చేయించిన నీటిపారుదల శాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంజిరెడ్డి డిమాండ్ చేశారు. నర్సంపల్లి రైతులకు న్యాయం చేకూరే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వినికి గోల్డెన్ అవార్డు



అవార్డును అందుకుంటున్న అశ్విని, ఉపాధ్యాయుడు బ్రహ్మయ్య

మర్కూక్(గజ్వేల్): జిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని అశ్విని జాతీయ కలాం సంస్థ గోల్డెన్ అవార్డును అందుకుంది. భౌతిక రసాయన శాస్త్రంలో 125 మూలకాలను సంకేతాలతో సహా 58 సెకండ్లలో పూర్తి చేయడంతో ఆమెను అవార్డు వరించింది. విద్యార్థిని ప్రాక్టీస్‌లో మంచి ప్రతిభను చాటుతుండటంతో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య చెన్నైలో నిర్వహిస్తున్న జాతీయ కలాం గోల్డెన్ అవార్డుకు అశ్విని చేసిన వీడియోను పంపించారు. వారు క్షుణ్ణంగా పరిశీలించి శుక్రవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేశారని మండల విద్యాధికారి వెంకట్‌రాములు తెలిపారు. శనివారం పాఠశాలలో అశ్వినిని ఉపాధ్యాయులు సన్మానించారు.

విద్యార్థిని కొట్టిన వైస్ ప్రిన్సిపాల్

చేర్యాల(సిద్దిపేట): సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ కొట్టిన ఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఈ విషయమై వైస్ ప్రిన్సిపాల్ రాజారావుతో సాక్షి ప్రతినిధి ఫోన్‌లో మాట్లాడగా విద్యార్థి పాఠశాల ఆవరణలో నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను నడిపే ప్రయత్నం చేశాడని, అందుకే కొట్టానని చెప్పాడు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకానికి జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. శనివారం ఎస్సీ కార్పొరేషన్ రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకం పోస్టర్‌ను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారితో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఆదాయం ఉన్న వారు అర్హులని, బ్యాంక్ సమ్మతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తును అర్జీదారు డౌన్‌లోడ్ చేసి, ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యార్హతలు, బ్యాంక్ ఖాతా ప్రతులను జత చేసి ఎంపీడీఓలకు, మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

డ్రగ్స్‌పై నిఘా పెట్టాలి

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేటరూరల్: జిల్లాలో డ్రగ్స్ వినియోగం, సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో రోడ్డు భద్రత కమిటీ, మత్తు పదార్థాల నివారణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో డ్రగ్స్ అవేర్నెస్ వీడియోలు, ఫొటోలతో ప్రచారం చేయాలని సూచించారు. విద్యా సంస్థలలో డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ బారిన పడిన వారిని డి–అడిక్షన్ సెంటర్‌కు పంపించాలని సూచించారు. అలాగే రాజీవ్ రహదారివెంట అనధికారిక డివైడర్ కటింగ్స్‌ను మూసివేసి, గ్రామాల నుంచి కలిసే చోట స్పీడ్ బ్రేకర్లు వేయాలన్నారు. అనంతరం తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో జారీ చేసిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అదనపు డీసీపీ అడ్మిన్ సుభాష్ చంద్ర బోస్, ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, డీడబ్ల్యూఓ లక్ష్మీకాంత్ రెడ్డి, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఏఓ అబ్దుల్ రెహమాన్, నేషనల్ హైవే, జీజీహెచ్ సూపరింటెండెంట్ శాంతి, ఆర్టీసీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

చెత్తను తొలగించి.. ఫాగింగ్



ఇండ్ల మధ్య చెత్త తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్

శనివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన చేర్యాల.. చెత్త చెత్త కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణ కేంద్రంలో ఇండ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. అలాగే దోమల నివారణకు పట్టణ కేంద్రంలో ఫాగింగ్ చేశారు.

– చేర్యాల(సిద్దిపేట)

క్లుప్తంగా

కూచిపూడి నృత్యంలో నంది అవార్డు



బహుమతులతో విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం హైద్రాబాద్‌లో జరిగిన కూచిపూడి నృత్య పోటీల్లో మెదక్ నృత్య టీచర్ శివానీకి నంది అవార్డు లభించింది. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మెదక్ పట్టణానికి చెందిన నటరాజ కళాతోరణం టీచర్‌తోపాటు వైష్ణవి, విద్యార్థులు విన్మయి,లక్ష్మీ సహస్ర, నిహారిక, విద్యశ్రీ, మేధశ్రీ, శాన్వి, వైశాలీ, పీ.వైష్ణవి, శాని, భానుశ్రీలను కన్సోలేషన్ బహుమతులతో సత్కరించారు.

పొలంలో పడిపోయి..

– ఊపిరాడక రైతు మృతి

వర్గల్(గజ్వేల్): ప్రమాదవశాత్తు పొలంలో పడిపోయి ఊపిరాడక రైతు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన శనివారం వర్గల్ మండలం అంబర్‌పేటలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. అంబర్‌పేటకు చెందిన రైతు మన్నె నర్సింలు(46)కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం తెల్లవారుజామున ఇంట్లో చెప్పి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన భార్య లక్ష్మి పొలం వద్దకు వెళ్లింది. అక్కడ పొలంలో బోర్లాపడి చనిపోయాడు.మృతుడి కుమారుడు వర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొండపోచమ్మ సాగర్ కాల్వ ధ్వంసం

– ఎనిమిది మందిపై కేసు



విచారణ చేస్తున్న విజయ్‌కుమార్

ములుగు(గజ్వేల్): మండలంలోని నర్సంపల్లి గ్రామ శివారులో గల కొండపోచమ్మ సాగర్ కాల్వను ధ్వంసం చేసి నీటిని వృథాకు కారణమైన ఎనిమిది మంది గ్రామస్తులపై కేసు నమోదు చేసినట్లు ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నర్సంపల్లికి చెందిన సందీప్‌రెడ్డి, ఎల్లం, సంతోష్, రాజు, సురేందర్‌రెడ్డి, ఐలేని, అశోక్, రాజిరెడ్డితోపాటు మరికొందరు 27న అర్ధరాత్రి సమయంలో గ్రామ శివారులో గల కొండపోచమ్మ సాగర్ కాల్వను ఝాన్సీరెడ్డికి సంబంధించిన జేసీబీతో తవ్వి ధ్వంసం చేశారు. దీంతో కాల్వ నీరు వృథాగా పోయింది. గమనించిన స్థానిక రైతులు కాల్వను పూడ్చేసి ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఇరిగేషన్ శాఖ ఏఈ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కాల్వ ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విశ్వావసు.. శుభములివ్వు

తెలుగు ప్రజలు నూతన సంవత్సరంగా భావించే పండుగ ఉగాది. ఈ పండుగ రోజున ఏదైనా శుభకార్యాలు ప్రారంభిస్తే ఏడాదిపాటు అంతా శుభమే జరుగుతుందని ప్రజల నమ్మకం. అలాంటి పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. క్రోధినామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పండుగ రోజు సంప్రదాయ బద్ధంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దశాబ్దాల కాలంగా కొందరు వేద పండితులు ఆలయాల్లో పంచాంగం చెబుతున్నారు. అలాగే భారతీయ సాంస్కృతిని విద్యార్థులకు అందిస్తూ ఇప్పటికీ పంచకట్టులో గురువులు పాఠశాలకు వెళ్తూ బోధన చేస్తున్నారు. ఉగాది పండుగను ఒక్కో గ్రామంలో ఒక్కో విధంగా జరుపుకుంటున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం...

సండే స్పెషల్

షడ్రుచుల మేళవింపు.. ఉగాది ఉషస్సు

- నేడు తెలుగు వారి ఉగాది పర్వదినం
- కొత్త పనులకు నాందిగా నిర్వహణ
- ఇదే రోజు వ్యవసాయ పనులకు శ్రీకారం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. పంచాంగ శ్రవణం
- తెలుగుదనం ఉట్టిపడేలా మామిడాకులు, అరటి తోరణాలతో అలంకరణ



–సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



విద్యార్థులకు పాఠం చెబుతున్న రాజశేఖరశర్మ



పాఠాలు బోధిస్తున్న గౌరీభట్ల బాలముకుందశర్మ

పంచకట్టులో బడి పంతుళ్లు

అమరవాది.. సంప్రదాయ వారధి

వర్గల్(గజ్వేల్): విద్యార్థులకు మాతృభాషపై పట్టును పెంపొందింపజేస్తూ.. పాట, పద్యం, కథ రచనలపై ఆసక్తిని కలుగజేస్తూ..సృజనాత్మకతను పెంపొందిస్తూ వర్గల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు భాషోపాధ్యాయుడు అమరవాది రాజశేఖరశర్మ పాఠం అంటేనే విద్యార్థులు చెవి కోసుకుంటారు. ధోవతి, పంచెకట్టుతో గంభీరంగా కన్పించే ఆయన పద్య రచనలు, గద్యాలు, వ్యాసాలతో తనదైన శైలిలో భాషా ప్రచారానికి, తెలుగును బతికించే బృహత్తర యజ్ఞానికి అనితర కృషి చేస్తున్నారు.

పండుగల మాధుర్యం తెలియాలి

'తెలుగు తియ్యదనం ఆస్వాదించాలి. సంస్కృతి బతకాలంటే భాష బతకాలి. భాషతోపాటు మన పండుగలు, జీవన విధానం బతికుంటుంది. మనకు పెద్దలు నేర్పిన సంస్కృతి సంప్రదాయాలు భవిష్యత్ తరానికి అందించాల్సి ఉంటుంది. పండుగల సందర్భాల్లో విద్యార్థులతో సమావేశమై పండుగ విశిష్టత, ఆ పండుగలలో తినుబండారాల ఆరోగ్య సూత్రాలు, ఆయా కాలాలు, ప్రకృతి అందించే వరాలను తెలియజేస్తాను. మొదటగా నేను పాటిస్తాను అంటున్నారు రాజశేఖరశర్మ'.

సాంస్కృతిని విద్యార్థులకు అందిస్తూ..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేటి ఆధునిక సమాజంలో పంచకట్టు అంటే తెలియని వారు ఉన్న తరుణంలో, ప్రతి రోజూ ఉదయం లేవగానే పాఠశాలకు పంచకట్టుతో ఉపాధ్యాయుడు వస్తుంటే అచ్చం తెలుగుదనం ఉట్టి పడుతుంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు బోధిస్తున్న గౌరీభట్ల రుక్మిణీ బాలముకుంద శర్మ 1996 నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు సిద్దిపేట పట్టణంలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తునే, విద్యార్థులకు భారతీయ సాంస్కృతీ సంప్రదాయాలను నేర్పిస్తున్నారు. తన 9వ యేటా ఉపనయనం చేసిన నాటి నుంచి నేటి వరకు పంచకట్టులోనే ఉంటూ పట్టణంలోనే ప్రత్యేకంగా నిలుస్తున్నారు. పంచెల తయారీలో నేతన్నల శ్రమ, వారి నైపుణ్యం, సాంప్రదాయాలు ఉన్నాయంటున్నారు శర్మ.

సరికొత్త వెలుగులతో..

మెదక్ మున్సిపాలిటీ:
ప్రకృతిలో మమేకమై పరిశీలిస్తే
ప్రతీ అణువులో కొత్తదనమే గొప్పదనమే

నిశిది చీకట్లతో నిత్యం పోరాడుతూ
ప్రతి రోజూ సరికొత్త వెలుగులతో
ఉదయించే భానుడి ఆశా కిరణాలు..

మట్టిలో కప్పబడిన విత్తనం
నశించినా మరల మట్టి
పొరలను చీల్చుకొని
మొక్కై మొలకెత్తి
పోరాట స్ఫూర్తి



ప్రకృతికి విరుద్ధంగా పయనించడం
మానేసి
రేపటి ప్రగతికై ప్రజ్వలించుదాం

అలుపన్నది లేక అనునిత్యం
ఆకాశాన్ని అంటాలని ఎగిసి పడే అలల
పటిమ
క్షణం కూడా తీరికలేక అనుక్షణం
పరిగెత్తే సమయం
ప్రకృతిలో ప్రతీది నిత్యం తనదైన శైలిలో
నూతనత్వంతో నవనవలాడుతుంది

రేపైతే వాడిపోయే గడ్డిపువ్వు అయినా
రంగు రంగుల హోయలతో
వయ్యార మొలకపోస్తుంది

మరి మనకెంత ఉత్తేజం ఉండాలి
మనకెంత చైతన్యం ఉండాలి అందుకే
కలల లోకంలో విహరిస్తూ..

ఆత్మగౌరవ చైతన్యంతో
అస్తిత్వానికై పోరాటం చేస్తూ
సమస్యల సవాళ్లను
సహదయంతో సాగుచేస్తూ
ఎదిగేందుకు ఎంతటి ప్రయాసాన్నైనా
ఎదుర్కొంటూ
నూతన సంవత్సరం అండై రావంగా

గతమనే సంపదతో
వర్ధమానాన్ని సాధన చేసి
భవ్యమైన భవిష్యత్
కలను సాకారం
చేసుకోవాలని కోరుకుంటూ ..
విశ్వ వసు నూతన సంవత్సర శుభాకాంక్షలు – కవిత, తెలంగాణ
రచయితల సంఘం మెదక్ అధ్యక్షురాలు

సంతోషాల సారధి



తూప్రాన్:
పల్లవి: వచ్చేసెను
విశ్వవసు–వానవిల్లు
తోరణమై
కోకిల పాటకు జతగా–
కొత్తరంగులద్దుకుని
చరణం: తేనెలొలుకు పికగానం
–తీయనైన ఆమ్రఫలం
ప్రతీ కొమ్మపువ్వులతో స్వాగతమిస్తుంటే
ప్రతీ పువ్వు పరిమళంతో పులకరిస్తుంటే
జీవితాన నవ వసంత భావం పండించాలనీ
–వచ్చేసెను::
చరణం: సంస్కృతీ సంప్రదాయం సందడి
చేసేలా పసుపు కుంకుమలు పల్లవి పాడిన
శుభవేళ తెలుగునేల వైభవం జగతిన నిలిచేలా
పల్లెలల గోగిల్లు రంగవల్లులతో స్వాగతమిడ
–వచ్చేసెను::
చరణం: కష్టాలను దాటుకుంటూ,
కన్నీళ్లను దాచుకుంటూ నిన్న మోడుగా నిలిచి,
నేడు మెండుగా మెరసి పరుచుకున్న అవాసలో
పాలపుంత నవ్వులా సరగున వచ్చేను ఉగాది–
సంతోషాల సారధి –వచ్చేసెను::
–రచన: వజ్జ రాజేశ్వర్, తూప్రాన్

కొత్త వెలుగులతో ముందుకు



సంగారెడ్డి జోన్:
నేను ఉగాదిని
ఈ సారి నా పేరు
విశ్వావసుని
నేను మీ భవిష్యత్
ప్రబోధిని పచ్చని ఆకులలో
నల్లని కోకిల గానాన్ని షడ్రుచులతో
మీ బతుకు జీవననాదాన్ని..
నిన్నటి దాకా నేను ఆకులు రాలిన మోడుని
నేడు పచ్చని ఆకులతో కొత్త హంగులు తొడిగిన
మళ్లీ కొత్త వెలుగులతో 365 రోజులకు
పరాభవనై మళ్లీ వస్తాను.
– రాంచందర్ భీంవంశీ, సహజ కవి

నాలుగున్నర దశాబ్ద కాలంగా పంచాంగ పఠనం

– దేవీ ఉపాసకులు చెప్పెల హరినాథ శర్మ



కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో దేవీ ఉపాసకులు చెప్పెల హరినాథ శర్మ నాలుగున్నర దశాబ్ద కాలంగా ఉగాది పంచాంగ పఠనం ద్వారా జనసామాన్యానికి భవిష్యత్తుపై భరోసా కల్పిస్తూ దేవాలయ ప్రాశస్థ్యాన్ని నలుమూలలకు వ్యాపించేలా కృషి చేస్తున్నాడు. గ్రహచార రీత్యా నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కార కోసం క్షేత్రాన్ని సందర్శించే వారికి సులభ పరిహారాలను సూచిస్తూ మార్గ దర్శనం చేస్తున్నాడు. 15 ఏళ్ల ప్రాయంలో కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఇంటర్మీడియట్ విద్య అర్ధాంతరంగా ఆగిపోగా నిరాశ చెందకుండా బాసర జ్ఞాన సరస్వతీ సన్నిధిలో 40 రోజుల పాటు కఠోర దీక్షతో అమ్మను ఉపాసించి కవిత్వం, జ్యోతిష్యం వంటి రంగాల్లో ప్రావిణ్యత సాధించాడు. ఇక్కడి దేవాలయంతోపాటు సిద్దిపేట హైదరాబాద్, కరీంనగర్, రంగారెడ్డి. మేడ్చల్, నిజామాబాద్, వరంగల్ తదితర పట్టణాల్లోంచి భక్తులు వచ్చి జ్యోతిష్యపరమైన దోశ నివారణ పరమైన సేవలను పొందుతున్నారు.

శ్రవణంలో ఘనుడు

– మూడు దశాబ్దాలుగా గోపాలకృష్ణశర్మ



వర్గల్(గజ్వేల్): ఏడేళ్ల ప్రాయం నుంచే తండ్రిని, పెద్దనాన్నను అనుసరిస్తూ పంచాంగ శ్రవణంపై పట్టు సాధించాడు వర్గల్ మండలం నాచగిరి ఆలయ పురోహితుడు త్రిగుళ్ల గోపాలకృష్ణ శర్మ. ఆస్థాన పురోహితుడిగా 1991 నుంచి శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధిలో పంచాంగ శ్రవణం చేస్తున్నాడు. ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా మూడు, నాలుగేళ్లు మినహాయిస్తే నాచారం గుట్ట దేవస్థానంలో పంచాంగ శ్రవణం అనగానే గోపాలకృష్ణ శర్మ అనే పేరు స్థిరపడిపోయింది. అర్చక పురోహిత విధులు నిర్వహిస్తున్న గోపాలకృష్ణ శర్మ 2015లో జిల్లా స్థాయి పురస్కారంతోపాటు మరెన్నో పురస్కారాలు పొందారు.

నలభై యేళ్లుగా..

– శ్రీచంద్రశేఖరశర్మ సిద్ధాంతి పంచాంగ గణన



వర్గల్(గజ్వేల్): పంచాంగ పుస్తక గుణనకు తండ్రే స్ఫూర్తిగా నిలిచారు. తండ్రి గతించడంతో అదే పరంపరగా పంచాంగ పుస్తక గుణన కొనసాగించారు. 1,985లో తండ్రి బ్రహ్మశ్రీ యాయవరం కృష్ణశర్మ సిద్ధాంతి గతించగా, పంచాంగ ప్రచురణ ఆగిపోకూడదనే భావనతో కుమారుడు యాయవరం శ్రీచంద్రశేఖర శర్మ సిద్ధాంతి రైల్వే ఉద్యోగం నిర్వహిస్తూనే గురుదేవులు అప్పన్నదాడై శ్రీనివాసాచార్య సిద్ధాంతి ఆశీస్సులతో అదే సంవత్సరం పంచాంగ పుస్తకం సిద్ధం చేశారు. 40 ఏళ్లుగా కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రతీ సంవత్సరం నాచారం గుట్ట దేవస్థానం, వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం, కీసరగుట్ట ఆస్థాన పంచాంగాలు గుణిస్తూ ఆయా క్షేత్రాల్లో ఉత్సవాలు, పండుగలు, అతివృష్టి, అనావృష్టి, సుముహుర్తాలు, గ్రహ గతులు, గ్రహణాది అంశాలు దృక్ పద్ధతిలో గుణించి నిర్ధారిస్తామని వివరించారు.

ఇంటికో మామిడి చెట్టు



జహీరాబాద్ టౌన్: కొందరు ఇప్పటికీ ఇంట్లో చెట్లు, మొక్కలు నాటుకుంటారు. చెట్ల నుంచి పండ్లు స్వచ్ఛమైన గాలి లభిస్తాయి. తెలుగు పండుగ ఉగాది వచ్చిందంటే పవిత్రంగా భావించే మామిడి పండ్లను పూజ పాత్రలో ఉంచుతారు. ప్రసాదంగా అందజేస్తారు. ఆకుల దండను ఇంటి ప్రధాన ద్వారంకు కడుతారు. ఉగాది పచ్చడిలో మామిడికి విశేష ప్రాధాన్యత ఉంది. ఫలాల్లో రారాజు అయిన మామిడి చెట్టు జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ మహీంద్ర కాలనీలో ఇంటింటికీ ఉంది. మహీంద్ర అండ్ మహీంద్ర పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులంతా కలిసి 30 ఏళ్ల కిందట పస్తాపూర్ వద్ద ఇళ్లను కట్టుకున్నారు.ఈ కాలనీకి మహీంద్ర కాలనీగా పేరొచ్చింది. ఇళ్ల నిర్మాణ సమయంలో ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మామిడి, వేప ఇతర మొక్కలను నాటుకున్నారు.మామిడి మొక్కలు ప్రస్తుతం పెద్ద పెద్ద చెట్లుగా మారాయి.

కోలాట ప్రదర్శన ప్రత్యేకం



ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కక్కర్‌వాడ గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని శ్రీ హనుమాన్ మందిర్ ఆలయ ఆవరణలో యువకులతోపాటు పెద్దలు సాయంత్రం సమయంలో పాటలు పాడుతూ కోలాట ప్రదర్శనను నిర్వహిస్తుంటారు. ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తెలుగు నూతన సంవత్సరం పురస్కరించుకొని కొత్త రోజు ప్రారంభంగా భావించి ప్రత్యేకంగా ఈ ప్రదర్శనను నిర్వహిస్తారు.

పేలాల లడ్డూలు విసురుతారు

– సంగారెడ్డిలో 15 ఏళ్లుగా వినూత్నంగా ఉగాది వేడుకలు



సంగారెడ్డి: ఉగాది అంటే షడ్రుచులతో కూడిన పచ్చడి గుర్తుకొస్తుంది.. కానీ సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో పచ్చడితోపాటు ప్యాలాల లడ్డూలు గుర్తుకొస్తాయి. ఉగాది రోజున ఈ ప్రాంతంలో ఉన్న రామ్ మందిర్‌పై నుంచి ప్యాలాల లడ్డూలు విసిరేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆలయానికి వచ్చే భక్తులు ఈ లడ్డూలను అందుకుంటారు. పండుగ రోజు సాయంత్రం బెల్లం, ప్యాలాలతో తయారు చేసిన లడ్డూలను గాల్లోకి విసురుతూ ప్రజలకు చేరే విధంగా పలు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం 15 ఏళ్లుగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి ముందు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. వేడుకలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తారు. విద్యుత్ అలంకరణలో ఆలయం జిగేల్ మంటుంది.

ముగ్గురిని బలిగొన్న విద్యుత్ షాక్

వేర్వేరు ప్రాంతాల్లో శనివారం ఒక్కరోజే విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి చెందారు. దీంతో మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్తంభం నుంచి తెగిపడి మంటలు అంటుకొని వ్యక్తి..



నర్సింహారెడ్డి(ఫైల్)

జహీరాబాద్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గోవింద్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మొగుడంపల్లి మండలంలోని అసద్‌గంజ్ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి (45)గోవింద్‌పూర్‌లోని ఫామ్‌హౌస్‌లో మూడేళ్లుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఫామ్‌హౌస్‌లో ముళ్ల పొదలు తొలగిస్తున్న క్రమంలో స్తంభం నుంచి విద్యుత్ తీగ తెగిపడి మంటలు అంటుకున్నాయి. విద్యుత్ కారణంగా ఒంటికి మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పక్క పొలాల్లో ఉన్న రైతులు గమనించి మంటలార్పివేశారు. చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

దేవాలయం వద్ద శుభ్రం చేస్తుండగా వృద్ధుడు..



దేవాలయంలో మాధవరెడ్డి మృతదేహం

రామాయంపేట(మెదక్): హనుమాన్ దేవాలయం శుభ్రం చేస్తుండగా విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రామాయంపేట మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో చోటు చేసకుంది. పోలీసుల కథనం మేరకు.. కోనాపూర్ గ్రామానికి చెందిన మాధవరెడ్డి (70) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గ్రామంలోని రామాలయంలో చెత్త తీసేస్తున్న క్రమంలో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్నానం కోసం పెట్టిన హీటర్‌ను పట్టుకొని వ్యక్తి



నర్సింలు(ఫైల్)

చేగుంట(తూప్రాన్): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గొరగల నర్సింలు(42) శనివారం స్నానం చేసేందుకు వాటర్ హీటర్‌తో నీళ్ల పెట్టుకున్నాడు. హీటర్‌ను ఆఫ్ చేయకుండా బకెట్ నీళ్లలో చేయి పెట్టడంతో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతుడి భార్య సంతోషి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ లిఫ్ట్ ఇచ్చి.. కళ్లలో కారం కొట్టి

- వృద్ధురాలి చెవి కోసి కమ్మలు లాక్కెళ్లిన దుండగులు
- నిందితుల అరెస్ట్, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): బైక్ లిఫ్ట్ ఇచ్చి వృద్ధురాలి మెడలోంచి బంగారం చోరీ చేసిన దుండగులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. శివ్వంపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన కలమ్మ ఈనెల 11న చిన్నశంకరంపేట మండలం సంగాయిపల్లిలో ఉంటున్న మనవరాలు ఇంటి వద్ద మల్లన్న పండుగకు వచ్చింది. ఈ క్రమంలో గ్రామంలోనే మల్లన్న గుడి వద్దకు నడుచుకుంటూ వెళ్తుంది. ఇదే సమయంలో మండలంలోని ఎస్.కొండాపూర్ గ్రామానికి చెందిన మాడబోయిన బాబు, గురుచరణ్ వృద్ధురాలిని మాటల్లో పెట్టి మేమూ గుడి వద్దకే వెళ్తున్నామని బైక్ ఎక్కించుకున్నారు. కొద్దిదూరం వెళ్లాక కోళ్లఫారమ్ చాటుకు తీసుకెళ్లి ఆమె కళ్లలో కారం చల్లారు. అరిస్తే చంపేస్తామని బెదిరించి మెడలోని 24 గ్రాముల బంగారు గుండ్లు, ముక్కుపుడక, అర తులం చెవి కమ్మలు లాక్కున్నారు. అదే రోజు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేట్టారు. శనివారం నమ్మదగిన సమాచారం మేరకు ఎస్.కొండాపూర్ గ్రామంలో నిందితులను వారి ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారం స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజం గౌడ్, ఎస్ఐ నారాయణ గౌడ్, సిబ్బంది రాజశేఖర్, భాస్కర్, సాజిద్‌అలీ, లక్ష్మణ్, రాజును డీఎస్పీ అభినందించారు.